

మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన నర్మద, దయాకర్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌లో చేరిక

కొడంగల్, అక్టోబర్ 2 : బీఎస్పీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద పదవికి, పార్టీకి రాజీనామా చేసి శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రిని కలిసి బీఆర్ఎస్ పార్టీ చేరారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి కూడా చేరారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి న్యాయకత్వంలో పనిచేస్తూ.. డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కు మార్ అడుగుజాడల్లో నడవడానికి నిర్ణయించుకొని 60 మంది కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. గత 7 సంవత్సరాలుగా పార్టీలకు అతీతంగా ఉండి బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేసేందుకు మాజీ మంత్రిని కలువడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొనసాగే అవకాశమిచ్చిన కేటీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి గులాబీ కండువాతో పార్టీలోకి స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ సలీం, గ్రంథాలయ సంస్థ నారాయణపేట జిల్లా మాజీ చైర్మన్ రామకృష్ణ, దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ మహిపాల్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి కృషి

ఆమనగల్లులో ఎంపీ మల్లురవికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

ఎంపీ మల్లు రవి

కడ్తాల్, అక్టోబర్ 26 : తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అన్నారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యుడిగా నియమితులై శనివారం నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన ఎంపీకి.. కడ్తాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్చానాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన ఫలాలు ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తున్నదని తెలిపారు. అనంతరం ఎంపీని పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ యువత పోటీపడాలి

ఆమనగల్లు : రాష్ట్రంలో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తున్నదని మల్లు రవి అన్నారు. నైపుణ్య శిక్షణ ద్వారా ప్రపంచంలో ఏ రంగంలోనైనా తెలంగాణ యువత పోటీపడాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఆమనగల్లులో శనివారం పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మల్లు రవికి అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మల్లు రవిని సత్కరించారు. పటాకులు పేల్చి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల, పట్టణ అధ్యక్షులు జగన్, మానయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులోభాగంగానే ముచ్చర్ల వద్ద యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు వారు తెలిపారు. సీఎం సహకారంతో ఉమ్మడి పాలమూరు-రంగారెడ్డి జిల్లాలకు మహర్దశ ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిశుపాల్ నగరంలోని కోకాపేటలోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పటిష్టతకు కృషిచేస్తూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలని హరీశ్‌రావు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. - చేవెళ్ల రూరల్, అక్టోబర్ 26

రుణమాఫీకి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

పంటల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 26 : ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ పంటలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, షాద్‌నగర్ వ్యవసాయ సంచాలకుడు రాజారత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతిలో, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలను సాగుచేస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేలో భాగంగా పంటలను పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు వడ్ల ధరపై క్వింటాల్‌కు ప్రభుత్వం ఇస్తున్న రూ.500 బోనస్‌పై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని 23732 మంది రైతులకు రూ179.32కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. దీనికి సంబంధించిన వివరాలతో కూడిన ధ్రువపత్రాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నర్సిరెడ్డి కుటుంబానికి పరామర్శ

కొడంగల్, అక్టోబర్ 26 : సీఎ రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండలానికి చేరుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివరాజ్ కుమారుడు సతీష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం హెలికాప్టర్‌లో కొడంగల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో కొడంగల్ నుంచి బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామానికి చేరుకొని ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు కార్యక్రమంలో పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పార్టీ కొడంగల్ మండల అధ్యక్షులు ప్రశాంత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలు

- డబ్బులు రికవరీ చేయాలని సిబ్బందికి డీఆర్‌డీవో శ్రీనివాస్ ఆదేశం
- రూ.25 వేల జరిమానా

సామాజిక తనిఖీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

నవాబుపేట,అక్టోబర్ 26 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ జరిగింది. రికార్డులను పరిశీలించగా అనేక అవకతవకలు బయటపడ్డాయి. యావపూర్ గ్రామంలో 70 మంది కూలీలు పనిచేయగా.. వారి సంతకాలు మాత్రం ఒక్కరే చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని డీఆర్‌డీవో శ్రీనివాస్ చెప్పారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురికి పనిచేయకుండానే పేమెంట్ ఇవ్వడం జరిగిందని తనిఖీల్లో తేలగా డీఆర్‌డీవో సీరియస్ అయ్యారు. అక్నాపూర్ గ్రామంలో తనిఖీలో పనిచేయకుండా ముగ్గురికి పేమెంట్ చేయగా బాధ్యత లేని పనిచేయడం కంటే తప్పుకుంటే మంచిదని వార్నింగ్ ఇచ్చారు. నవాబుపేట గ్రామంలో 500ల మొక్కలకుగానూ 600 అని రికార్డుల్లో రాయడం ఎంతవరకు సమంజసని మండిపడ్డారు. కుమ్మరిగూడ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పనులకు సంబంధించి చేసిన పనికి, పేమెంట్‌కు సంబంధం లేకుండా కూలీల అకౌంట్లో డబ్బులు వేయగా.. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, మేటీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌డీవో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించాలన్నదే ఉపాధి హామీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రికవరీ కింద రూ.1,05,698 వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని.. సిబ్బందికి రూ.25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఏవీఎం భార్గవి, ఎస్ఆర్‌పీ రమేశ్, ఎంపీడీవో అనురాధ, సూపరింటెండెంట్ అజయ్, ఏపీవో లక్ష్మీదేవి, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టామార్పిడి

న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన

మంచాల రెవెన్యూ కార్యాలయం ఎదుట న్యాయం చేయాలంటూ పట్టాపాస్ పుస్తకాలను చూపిస్తున్న యాదమ్మ

మంచాల, అక్టోబర్ 26 : మంచాల మండలం బండలేమూరు గ్రామానికి చెందిన రైతు కొట్టం యాదమ్మకు సర్వే నం.93, 96లో 9 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఇందులోనుంచి 3ఎకరాల29గుంటల భూమిని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ అయిన విషయం తెలుసుకున్న రైతు యాదమ్మ కుటుంబసభ్యులు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తమ పట్టాభూమిని ఏ కారణంతో తొలగించారని అధికారులను ప్రశ్నించారు. తమ పేరుపై ఉన్న పట్టా భూమిని ఎందుకు తొలగిస్తున్నారనే విషయంతో సంబంధం లేకుండా భూమిని ఇతరుల పేరుపై ఎలా రిజిస్ట్రేషన్ అయ్యిందని.. ఇందుకు ఎవరు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నో సంవత్సరాల నుంచి భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని.. తమ భూమి ఎవరికి అమ్మకున్నా కూడా గ్రామానికి చెందిన సీతారాంనాయక్ పేరుపై ఎలా రిజిస్ట్రేషన్ అయ్యిందని ప్రశ్నించారు. ఈ విషయంపై మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావును వివరణ కోరగా 2021లోనే మ్యుటేషన్ కోసం సీతారాంనాయక్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడని.. దాని ప్రకారమే స్లాట్ బుక్ చేసుకొని వారు రిజిస్ట్రేషన్ చేసుకొని ఉంటారన్నారు. అయితే యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను క్షేత్ర స్థాయికి వెళ్లి జరిగిన విషయాన్ని సంబంధిత రైతులను అడిగి తెలుసుకొని వారికి న్యాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చినట్లు చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితులు

సాధువుల వేషంలో వచ్చి..

బంగారు ఉంగరంతో ఉడాయించి..

నలుగురు కేటుగాళ్ల అరెస్టు, రిమాండ్‌కు తరలించిన పోలీసులు

యాచారం, అక్టోబర్ 26 : సాధువుల వేషంలో వచ్చిన నలుగురు కేటుగాళ్లు ఓ వ్యక్తికి మాయ మాటలు చెప్పి మోసం చేశారు. అతడి నుంచి అర తులం బంగారు ఉంగరాన్ని అపహరించుకొని ఉడాయించారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి గేటు సమీపంలో జరిగింది. దొంగతనానికి పాల్పడిన నలుగురు దుండగులను మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన నలుగురు నిందితులను శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

సీఐ శంకర్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మాధవరెడ్డి ఈ నెల 23న తక్కళ్లపల్లి గేటు నుంచి తన గ్రామానికి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. సాధు వేషధారణలో ఉన్న నలుగురు వ్యక్తులు తెల్ల కారులో వచ్చి అతడితో మాట్లాడారు. చుట్టుపక్కల ఎక్కడైనా ఆలయాలు ఉన్నాయా సేద తీర్చుకోవడానికి కావాలి అని అడిగారు. అతడికి అనేక రకాల మాయ మాటలు చెప్పి మభ్యపెట్టారు. అతడికి ఒక రుద్రాక్షను మంత్రించి ఇచ్చారు. మాధవరెడ్డి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసిస్తే.. దానికి పూజ చేసి ఇస్తామని.. ఇకపై అంతా మంచి జరుగుతుందని అతడిని నమ్మించారు. దీంతో మాధవరెడ్డి ఉంగరాన్ని తీసి వారికివ్వగా.. అక్కడి నుంచి ఉంగరంతో ఉడాయించారు. దీంతో మాధవరెడ్డి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

మండలంలోని మాల్ మార్కెట్‌లో ఉన్న అంతర్ జిల్లా బార్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా, అనుమానంగా ఉన్న ఓ తెల్ల కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో నలుగురు సాధువుల వేష ధారణతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో ఉన్న గుజరాత్‌కు చెందిన కవార్నాథ్, సావ్‌నాథ్, పర్దేశీనాథ్, ప్రేమ్‌నాథ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో దుండగులు మాధవరెడ్డి ఉంగరాన్ని తీసుకున్నట్లు నేరం అంగీకరించారు. వారి నుంచి బంగారు ఉంగరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, ఎవరైనా అనుమానితులు సంచరిస్తే 100కు, స్థానిక పోలీసులకు వెంటనే సమాచారమివ్వాలని సీఐ శంకర్‌కుమార్ సూచించారు.

ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

పోలీసులు అందుబాటులో ఉండాలి

రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ తనిఖీ.. రికార్డుల పరిశీలన

ఆదిబట్ల, అక్టోబర్ 26 : సామాన్య ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్లతో పాటు ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది పనితీరు ప్రజలు మెచ్చుకునేలా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక సీఐ రాఘవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వారికి సూచించారు. కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పోలీస్‌స్టేషన్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేయడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీ టీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. ప్రతి కేసుకు సంబంధించిన విషయాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

కృతనిశ్చయం, పట్టుదలతో విద్యనభ్యసించాలి

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

మొయినాబాద్, అక్టోబర్ 26 : విద్యార్థులు కృతనిశ్చయం, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి అవకాశముంటుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'టెడ్ ఎక్స్' అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రతికూల పరిస్థితుల్లో పట్టుదలే మన లక్ష్యాలను సాధించడానికి మనల్ని నడిపిస్తుందని చెప్పారు. నాయకత్వం వహించాలంటే జీవితంలో వచ్చే సవాళ్లను అధిగమించాలని సూచించారు. విద్యాజ్యోతిలో టెడ్ పేరుతో నిర్వహించిన కార్యక్రమం వినూత్న ఆలోచనలను పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో అనేక అంశాలపై చర్చలు జరపడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడానికి సెమినార్‌లు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన రీనాలీసా, తపస్యలకు బొకే అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఆమనగల్లు, అక్టోబర్ 26 : స్కూల్ గేమ్స్ సమాఖ్య 68వ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 25న వికారాబాద్ జిల్లాలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఆమనగల్లులో ఉన్న వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న రీనాలీసా, తపస్య అనే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నవంబర్ నెలలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో రీనాలీసా, తపస్యలను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

లా కోర్సుల ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26 : ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్క్స్ మెమోలను వచ్చే నెల 4 నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.700 చెల్లించి వచ్చే నెల 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించి వచ్చే నెల 23 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీపీజీఈటీ చివరిదశ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

టీజీ సీపీజీఈటీ-24 సెట్ చివరి దశ ప్రవేశాలతో పాటు ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల మొదటి దశ ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొఫెసర్ జలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 1న వెరిఫికేషన్ వివరాలను వెల్లడిస్తామని, 4వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని, 4న ఎడిట్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రాథమిక సీట్ల కేటాయింపు జాబితాను 8న విడుదల చేస్తామని, అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో 12లోగా రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా హోం డెలివరీ

పరిగి, అక్టోబర్ 26 : టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా వినియోగదారులకు పార్సిల్స్ హోం డెలివరీ సదుపాయం కల్పించామని రంగారెడ్డి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీందర్ తెలిపారు. రాష్ట్రంతోపాటు, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చే పార్సిళ్లను హైదరాబాద్‌లో హోం డెలివరీ ఈ నెల 27 నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా 31 కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. హోం డెలివరీ కోసం కిలోకు రూ.50, 5 కిలోల వరకు రూ.60, 5 నుంచి 10 కిలోల వరకు రూ.65, 10 నుంచి 20 కిలోల వరకు రూ.70, 20 నుంచి 30 కిలోల వరకు రూ.75 చార్జీలు వసూలు చేయడం జరుగుతుందని చెప్పారు. పార్సల్ సెంటర్లలో ఏజెంట్లు తీసుకొని హోం డెలివరీ చేస్తారని ఆయన తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26 : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య ద్వారా అందించే అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ మ్యాథ్స్/ఈఎల్‌టీ/బీఎం, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ, అక్టోబర్ 26 : ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 7లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 11వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

కొనసాగుతున్న గ్రూప్-1 పరీక్షలు

కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్, అక్టోబర్ 26 : గ్రూప్-1 పరీక్షలు ఆరో రోజు ప్రశాంతంగా సాగాయి. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 984 మంది అభ్యర్థులకుగాను 579 మంది హాజరయ్యారు. చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి